టైము ఏడుగంటలు అయింది. రేణుక యింట్లోంచి గేటులోకి, గేట్లోంచి యింట్లోకీ అప్పటికి పదిసార్లు తిరిగింది.

"ఏమోయ్... ముఖం కడుక్కొని పావుగంట అయింది" భర్త గొంతు దర్పంగా పలికేసరికి రోషం వచ్చింది రేణుకకి...

"పేపరు చదవటం కూడా పూర్తయింది" "నేనేంచేయను?... యింకా పాలవాడు రాలేదు" విసుగ్గా అంది.

"పాలవాడు వస్తే లోపలికి రాడా?... ఓ... నువ్వెందుకు అలా తిరిగి హైరానా పడిపోవటం?"

"ఆ... ఎందుకా?... గేట్లోనే నిలబెట్టి నాలుగు చివాట్లు వేద్దామని..."

"కుర్చీలో తాపీగా కూర్చో... పది చివాట్లు వేయొచ్చు... అసలు ఈ చిరాకంతా దేనికి? పెందలాడే వచ్చే పాలవాడ్ని కుదిరించుకుంటే సరి"



# వ్యాపారం

## కోటమర్తి రాధా హిమబిందు

"అనగానే సరా?... పాలవాడు కుదరొద్దూ... యితను దొరికే సరికే నానా యిబ్బంది అయింది. అదిగో వస్తున్నాడు లెండి..." పిట్టగోడమీద నుంచి పాలవాడ్ని గమనించి నిట్టూర్పు విడిచింది.

"అయితే యిక ప్రారంభించు..." అంటూ పేపర్లోకి తల దూర్చిన భర్త వైపోసారి చూసి గిన్నె తేవటానికి లోపలికి వెళ్ళింది రేణుక.

* * *

"ఇందిరా... కాఫీ"

"పాలు రాలేదు"

"యింకా రాలేదా... అదేంటి?... టైమ్ ఏడున్నర దాటింది..."

"ఏమో మరి"

"నువ్వు గట్టిగా మాట్లాడాలి... నీ నెమ్మదితనమే పాలవాడికి అలుసుగా మారింది"

"మనం ఎంత గట్టిగా మాట్లాడినా వాళ్ళు అనుకున్న టైముకే వాళ్ళు వస్తారు. మనం ఏదైనా అంటే యింకోచోట చూసుకోండి... నా టైము యిదే అంటాడు... మనకేమో ఈ సైకిల్ పాలే కావాలి... ప్యాకెట్ పాలు యిష్టం వుండదుగా"

"పాలబ్బాయి బండి కొన్నట్లుంది"

"యింకా కొనలేదు... కొంటాడట... నిన్న వాళ్లన్నయ్య బండి వేసుకొని వచ్చాడు... అదిగో... వస్తున్నాడు లెండి... ఐదు నిమిషాల్లో కాఫీ కలిపి యిస్తాను... గిన్నె తేవటానికి లోపలికి వెళ్లింది ఇందిర...

* * *

"హలో... బాగున్నారా?..."

"ఓ... రేణుకగారా... బాగున్నారా..."

"ఏంటి మా యింటికి రావటం బొత్తిగా తగ్గించారు?..."

"వారం రోజులక్రితం యిల్లు మారామండీ... చాలా దూరం వెళ్ళాం... అయినా కలిసిన మనసులకు దూరం ఉంటుందా ఏంటి? మా కొత్త యింటికి మీరు తప్పక రావాలి" అంటూ అడ్రసు చెప్పింది ఇందిర...

"ఈమధ్య మీ యింటికి వద్దామని చాలా సార్లు అనుకున్నానండీ... పిల్లలు వచ్చి పదిరోజులు వున్నారు. అదీగాక మీకు తెలియంది ఏముంది?... అయిన వాళ్లంతా చుట్టుప్రక్కల వున్నారు... బంధువులు ఎవరో ఒకరు మా యింటికి వస్తూనే వుంటారు గదా... తీరికలేక రాలేదు"

"మీ యింటికి అలా బంధువులు వస్తుంటే నాకు భలే సంతోషంగా వుంటుందండీ... మా యింటికి తరచూ ఎవరో ఒకరు అలా వస్తుంటే బాగుండునన్పిస్తుంది. ఉద్యోగపరంగా అందర్నీ వదులుకుని యింత దూరంగావున్నాం గదా ప్రాణం గుంజుతుంది"

"అబ్బో... అలా అనుకోకండి... అదంతా ఓ పెద్ద చిరాకు. వాళ్ళకోసం ఎక్స్ట్రా పనులు... ఫార్మాలిటీస్... చాలా వుంటాయి లెండి...

ఎప్పుడో ఒకసారి అయితే ఏదైనా అపురూపమే. అయినా తమ విషయాలు తమకు నచ్చక ఎదుటివాళ్ళ విషయాలే బాగా నచ్చటం మానవ సహజం కదా... అవునూ ఇందిర గారూ... మీకు పాలు ఎవరు పోస్తున్నారు?"

"రాజు అని... ఒకతను పోస్తున్నాడు"

"మాకు ప్రసాద్ అని ఒకతను పోస్తున్నాడు. ఎట్లాగూ ఏడూ ఏడున్నర కానిదే రాడనుకోండి... మనకేమో కాఫీ, టీలు బాగా అలవాటాయె... అడగగా అడగగా ఓ పావుగంటో అరగంటో ఎప్పుడో గాని ముందుగా రావటం... దానికే చిరాకనుకుంటే ఈమధ్య మరీ చిరాకెక్కువవుతోంది..."

"దేనికి?"

"పాలు కటికనీళ్లు... ఈ మధ్యే ధర బాగా పెంచారుగా... పెంచినందుకు పాలు కాస్త చిక్కగా పోయాలి కదా అప్పటికంటే మరీ నాసిరకంగా పోస్తున్నాడు"

"మా పాలూ సేమ్ అంతే"

"ఛీ ఛీ... రేటెక్కువ... నీళ్లెక్కువ..."

"నేనే మిమ్మల్ని పాలవిషయం అడగాలనుకున్నాను... కాఫీ, టీ లకు ఓ రంగు లేదు, రుచి లేదు, చిక్కదనం లేదు..."

"పొడి తేడా ఏమో?..."

"సేమ్ అదే పొడి. పాలదే తేడా అంతా..." విసుగ్గా అంది ఇందిర...

"సరే... నేను వెళ్తానండీ మరి"...



రంగారెడ్డి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా తాండూరులో 'సుదర్శనం' వచన కవితా సంపుటికి డా॥ ఓగేటి సాహితీ పురస్కారం అందుకుంటున్న కవి డా॥ మోపిదేవి విజయగోపాల్ (మానసిక వైద్యులు - ఆంధ్రా మెడికల్ కాలేజి, విశాఖపట్నం). సభలో డా॥ ఘనశ్యామల ప్రసాదరావు, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి (అధ్యక్షులు - జాతీయ సాహిత్య పరిషత్) డా॥ వడ్డి విజయసారధి (ఎడిటర్ - జాగృతి సాహితీ సమితి)

"మంచిదండీ... మీరు తప్పక మా యింటికి రావాలి..."

"వస్తాను లెండి... ముందు మీరోసారి రండి మా యింటికి".

"కొత్త ప్రదేశం గదా... బోర్‌గా ఫీల్ కావటంలేదా?"

"బోర్‌గానే వుంటోందండీ..."

"మరి రండి... నేనూ తప్పక వస్తుంటాను... వెళ్లొస్తానండీ... బై..." అంటూ ముందుకు సాగింది రేణుక.

"బై" అంటూ వెనుతిరిగింది ఇందిర...

"రండి... రండి... బాగున్నారా... ఇలా మీరు రావటం చాలా సంతోషంగా వుంది. యిప్పుడే బంధువులు వెళ్లిపోయారు... పైపైన ఇల్లు సర్దేసి యిలా కూర్చున్నాను" అంటూ ఎదురొస్తూ ఆనందంగా ఆహ్వానించింది ఇందిరను రేణుక.

"టీ.వి. సీరియల్స్... సినిమాలు... ఎందాకని చూడను? బాగాబోర్‌గా అన్పించి వచ్చాను"

యిద్దరూ కాస్సేపు మాట్లాడుకున్నారు...

"వన్ మినిట్" అంటూ లోపలికి వెళ్లి పాలకోవా తెచ్చింది రేణుక.

"అబ్బ...పాలకోవా..."

"మీకు చాలా యిష్టం అని చెప్పారుగా... తీసుకోండి..."

"మీరు చేసారా..."

"అహ... బయటనుంచి తెచ్చిందే..."

"పాలకోవా చూస్తే గుర్తొచ్చింది పాల సంగతి ఏమిటి? ఎవరినన్నా అడిగారా?..."

"ఆ... అతన్ని మాన్పించాను. నాలుగు తిట్టి మరీ మాన్పించాను... యింకో అతను పోస్తున్నాడు ఈశ్వర్ అని... చిక్కగానే పోస్తున్నాడు... అంటే... అప్పటి మీద బెటర్‌గా వున్నాయి. అదే ధర..." హుషారుగా అంది రేణుక...

"నేనూ మార్చాను... యిపుడు 'టీ' కాస్తా రుచిగా వుంటోంది. పాలు ఫర్వాలేదు... బాగానే పోస్తున్నాడు" సంతోషంగా అంది ఇందిర. తర్వాత కొంచెంసేపు మాట్లాడి వెళ్లిపోయింది ఇందిర.

* * *

"మంచి ఐడియా యిచ్చావు బాసూ... ఒకళ్ల యిళ్లను ఒకళ్లం మార్చుకుని ఖాతాలు పోగొట్టుకోకుండా చేసుకున్నాం... థాంక్యూ..." చేయి కలిపాడు రామరాజు...

"ఏదో ఒక తెలివి 'ప్లే' చేయకపోతే ఈ పాల వ్యాపారం ఎలా సాగుతుంది?... మనిషి మారేసరికి పాలు కూడా అంతో యింతో మారతాయని వాళ్ల ఫీలింగ్. ఆ భ్రమలో వాళ్లు అలా వుండిపోవటమే మనకు కావల్సింది..."

"నాలుగు రోజులు చిక్కగా పోసి ఐదో రోజు నుంచి క్రమేపీ నీళ్ల శాతం పెంచుతూ నెల రోజుల్లో వాళ్లకెంతో నమ్మకాన్ని కుదిరించాం..."

"ఆ నమ్మకాన్ని మనం జాగ్రత్తగా కాపాడుకోవాలి. మనం మాత్రం యిలా మారిపోయామని వాళ్లకు తెలియనీయకూడదు ఎప్పటికీ..." కన్ను గీటాడు ఈశ్వరప్రసాద్...

"ఎలా తెలుస్తుంది బాసూ... నువ్వో మూల... నేనోమూల"... ఆహ్లాదంగా చిరునవ్వులు చిందించాడు రామరాజు.

యిప్పుడు రేణుక వాళ్లింట్లో రామం... ఇందిర వాళ్లింట్లో ఈశ్వర్ పాలు పోస్తున్నారు. వాళ్ల పేర్లు అవే అని చెప్పారు. రేణుక, ఇందిర ఆ పేర్లతోనే పిలుస్తున్నారు. ●